బలగం
BALAGAM TV
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 21 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మహాకుంభమేళాలో 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జనవరి 13న ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమైన మహాకుంభమేళాలో 12 లక్షల తాత్కాలిక ఉద్యోగాల సృష్టి జరిగిందని గ్లోబల్ టెక్నాలజీస్ అండ్ డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎన్‌ఎల్‌బీ సర్వీసెస్ అంచనా వేసింది. వివిధ రంగాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ సంస్థ ఈసీవో సచిన్ అలగ్ ఈ మేరకు గణాంకాలు విడుదల చేశారు. సుప్రసిద్ధ ఆధ్యాత్మిక కార్యక్రమంతో ఉత్తరప్రదేశ్‌లో ఆర్థికవృద్ధి, తాత్కాలిక ఉపాధి కకల్పన జరుగుతుందని సచిన్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రభావం పలు రంగాలపై కనిపిస్తుందన్నారు. పర్యాటక, ఆతిథ్య రంగాల్లోనే దాదాపు 4.5 లక్షల మందికి ఉపాధి లభించివుండొచ్చని పేర్కొన్నారు. హోటల్, టూర్ గైడ్, పోర్టర్లు, ట్రావెల్ కన్సల్టెంట్లు, ఈవెంట్ కోఆర్డినేటర్లుగా అనేక మందికి ఉపాధి లభిస్తున్నదని చెప్పారు. రవాణా అనుబంధ రంగాల్లో 3 లక్షల మందికి, తాత్కాలిక వైద్య శిబిరలాలో 1.5 లక్షల మందికి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. అదే సమయంలో 2 లక్షల మంది ఐటీరంగ నిపుణుల సేవలు మహాకుంభ మేళాలో అవసరం అవుతున్నాయని తెలిపారు.

# అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం..

- అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం
- హాజరైన ప్రపంచ ప్రముఖులు
- శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని మోడీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10.30 గంటలకు ఆయన ప్రమాణస్వీకారం చేశారు. అమెరికా రాజధాని వాషింగ్టన్ లోని క్యాపిటల్ హిల్ భవనం ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచింది. ఇక్కడి రోటుండా ఇండోర్ ఆడిటోరియంలో జరిగిన ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రపంచ ప్రముఖులు హాజరయ్యారు. వివిధ దేశాల అధినేతలు ట్రంప్ ప్రమాణ స్వీకార వేడుకకు తరలివచ్చారు. ట్రంప్ భార్య మెలానియా, కుమార్తె ఇవాంకా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భారత్ తరపున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని మోదీ తరపున లేఖను ట్రంప్ కు అందించారు.

ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్, ఫేస్ బుక్ ఫౌండర్ మార్క్ జుకర్ బర్గ్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్ మన్ తదితర టెక్ దిగ్గజాలు కూడా హాజరయ్యారు. భారత కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేశ్ అంబానీ, ఆయన అర్ధాంగి నీతా అంబానీ కూడా ఈ కార్యక్రమంలో తళుక్కుమన్నారు. కాగా, డొనాల్డ్ ట్రంప్ తో అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన కంటే ముందు, ఉపాధ్యక్షుడిగా తెలుగింటి అల్లుడు జేడీవాన్స్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా హాజరయ్యారు. అమెరికా అధ్యక్ష పీఠం అధిష్ఠించడం ట్రంప్ కు ఇది రెండోసారి. "ఐ... డొనాల్డ్ ట్రంప్..." అంటూ ఆయన ప్రమాణస్వీకారం మొదలుపెట్టారు. ప్రమాణస్వీకారం పూర్తయ్యాక... క్యాపిటల్ హిల్ భవనం వెలుపల శతఘ్నులు సింగిల్ రౌండ్ కాల్పులతో గౌరవవందనం సమర్పించాయి.

అమెరికా ఫస్ట్ అనేది తమ నినాదమని మరోసారి స్పష్టం చేసిన ట్రంప్.. ప్రపంచంలోనే అమెరికాను గొప్ప దేశంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. " ప్రమాణ స్వీకారానికి వచ్చిన అతిథులందరికీ కృతజ్ఞతలు. అమెరికాకు స్వర్ణయుగం మొదలైంది. అమెరికా ఫస్ట్ అనేది మా నినాదం. సరిహద్దుల్లో నేరస్తులు పేట్రేగిపోతున్నారు. అమెరికా అనేక ఆటుపోట్లు తట్టుకుని నిలబడింది. అమెరికా దక్షిణ సరిహద్దులో ఎమర్జెన్సీ విధిస్తున్నారం. దక్షిణ సరిహద్దుల్లో మరిన్ని సైన్యాన్ని మోహరిస్తాం. అక్రమ వలసదారులను అమెరికా నుంచి వెనక్కి పంపిస్తాం. విదేశీ ఉగ్రవాద సంస్థలపై ఉక్కుపాదం మోపుతాం. అమెరికాను తుఫాన్లు అతలాకుతలం చేశాయి. అనేక సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని అమెరికా నిలబడింది. అమెరికాలో విద్య, ప్రజావైద్యం మరింత మెరుగుపరచాల్సి ఉంది. దేశ న్యాయవ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తాం. అమెరికా ప్రజలకు నేడు స్వాతంత్ర్య దినం.దేశ సరిహద్దుల రక్షణ చాలా ముఖ్యం. శాంతిభద్రతల విషయంలో మరింత కఠినతరంగా ఉండాలి. అమెరికా పేరు ప్రఖ్యాతులను నిలబెట్టేందుకు అమెరికన్లు ముందుకు రావాలి. దేవుడి దయతో తుపాకీ కాల్పుల నుంచి తృటిలో బయటపడ్డాను. 2025 మనకు స్వేచ్ఛాయుత సంవత్సరం.

అమెరికా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి వెంటనే నా మంత్రివర్గం పని చేస్తుంది. ధరలను తగ్గిస్తాం. ప్రపంచంలోనే అతిపెద్ద మ్యాన్‌ఫాక్చరింగ్ దేశంగా అమెరికా అవతరిస్తుంది. ప్రపంచంలో అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా అమెరికా నిలుస్తుంది. ఆటోమొబైల్ రంగాన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్తాం. పౌరులు తమకు నచ్చిన మోడల్ వాహనాన్ని కొనుగోలు చేసేలా చేస్తాం. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిని భారీగా పెంచుతాం. న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా పనిచేసేలా చూస్తాం. రాజకీయ కక్ష సాధింపులకు ఆస్కారం ఇవ్వం. ఇకపై శత్రువులపై పోరాటమే అమెరికా దళాలకు ఏకైక లక్ష్యం. ప్రపంచంలనే అత్యంత శక్తివంతమైన సైన్యాన్ని తయారు చేస్తాం. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తాం. ప్రపంచంలో శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తాం. మా ప్రభుత్వం ఏర్పాటు అయ్యేందుకు ఒకరోజు ముందే ఇజ్రాయెల్ బందీలు విడుదలయ్యారు. గాజా బందీలు ఇంటికి చేరుకోవడం సంతోషం." అని అన్నారు.



# దావోస్‌కు సీఎం రేవంత్

- జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం
- ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ బృందం
- సదస్సులో 'గ్రాండ్ ఇండియన్ పెవీలియన్'ను కేంద్ర మంత్రులతో కలిసి ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొనడానికి జ్యూరిచ్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెకి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి గారు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ఉన్నతాధికారుల ప్రతినిధి బృందం జ్యూరిచ్ విమానాశ్రయం చేరుకోగానే అక్కడ స్థిరపడిన తెలుగు వారితో సందడి నెలకొంది. ముఖ్యమంత్రి గారెకి పెద్ద ఎత్తున హాజరై అభినందనలు తెలియజేశారు. జ్యూరిచ్ విమానాశ్రయంలో రేవంత్ రెడ్డి గారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పరస్పరం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై వారి మధ్య క్లుప్తంగా చర్చ జరిగింది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గారు, మంత్రి శ్రీధర్ బాబు గారు, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ గారు కూడా ఉన్నారు. దావోస్ సదస్సు తొలి రోజున పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి గారు సమావేశమవుతారు. అంతర్జాతీయ పెట్టుబడుల గమ్య స్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసే నిర్దిష్టమైన భవిష్యత్తు ప్రణాళికతో ఈ పర్యటనపై రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో భాగంగా దావోస్‌లో ఏర్పాటు చేసిన 'గ్రాండ్ ఇండియన్ పెవీలియన్'ను కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారు. దావోస్‌లో తొలి రోజున జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం గారితో పాటు కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్ గారు, జయంత్ సింగ్ గారు, కేరళ మంత్రి పి. రాజీవ్ గారు, ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులతో పాటు అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు ఆహ్వానం పలికారు. సీఎం రేవంత్ రెడ్డి గారి సారధ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, ఆగ్రో ప్రాసెసింగ్ తో పాటు స్కిల్ డెవలప్మెంట్ రంగానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని గుర్తుచేశారు. 'ఇండియా 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా భాగస్వామ్యం కావాలన్నదే ముఖ్యమంత్రి గారి ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

## కోల్‌కతా లైంగికదాడి హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



దేశంలో సంచలనం సృష్టించిన కోల్ కతా ట్రైనీ డాక్టర్ లైంగికదాడి హత్య కేసులో సీల్దా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌కి కోర్టు శిక్షను ఖరారు చేసింది. దోషిగా తేలిన సంజయ్ రాయ్ కి జీవిత ఖైదు, రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. శనివారం అతడిని న్యాయస్థానం దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. గత సంవత్సరం ఆగస్టు 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్జీకర్ హాస్పిటల్‌లో సెమినార్ గదిలో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి హత్య జరిగింది. ఈ ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. వెస్ట్ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్ కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారించింది. దీనిలో భాగంగా స్పెషల్ కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. గ్యాంగ్ రేప్ కేసు విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. హాస్పిటల్‌లో ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10వ తేదీన కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ కేసులో దోషి సంజయ్ రాయ్‌కు సీల్దా కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ కేసులో నిందితుడు సివిక్ వాలంటీర్ సంజయ్‌రాయ్‌ను భారతీయ న్యాయసంహితలోని 64, 66, 103/1 సెక్షన్ల కింద శనివారం దోషిగా తేల్చిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ సోమవారం ఈమేరకు తీర్పు ఇచ్చారు. రూ.50 వేల జరిమానా కూడా విధించారు. అలాగే బాధితురాలి కుటుంబానికి రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని బంగాల్ ప్రభుత్వానికి ఆదేశించారు.

కట్టుదిట్టమైన భద్రత మధ్య దోషి సంజయ్‌రాయ్‌ను సీల్దా కోర్టుకు తరలించారు. 500 మంది పోలీసులను మోహరించారు. శిక్ష ఖరారు చేయ డానికి ముందు తన వాదనను వినిపించుకోవడానికి జడ్జి అతడికి అవకాశం కల్పించారు. తాను ఏ నేరమూ చేయలేదని ఈ సందర్భంగా సంజయ్ కోర్టులో చెప్పాడు. ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించినట్లు వాపోయాడు. తనతో బలవంతంగా కాగితాలపై సంతకాలు చేయించారని, తాను అమాయకుడినని వాదించాడు. ఈ కేసుకు సంబంధించి పలు ఆధారాలు ధ్వంసమయ్యాయని తాను విన్నట్లు తెలిపాడు. మరోవైపు సీబీఐ తరపు న్యాయవాది మాట్లాడుతూ ఇది చాలా అరుదైన కేసని, ఈ ఘటన పౌర సమాజాన్ని ఎంతగానో కలచి వేసిందని గుర్తు చేశారు. దోషి సంజయ్‌రాయ్‌కు ఉరిశిక్ష విధించాలని కోరారు. వైద్యులకే రక్షణ లేకపోతే ఇంకేం చేయాలని, మరణశిక్ష మాత్రమే సమాజంలో విశ్వాసాన్ని పునరుద్ధరించగలదని వాదించారు. ఇరు పక్షాల వాదనలు జడ్జి ఇది అరుదైన కేసు కాదని పేర్కొంటూ, చివరకు జీవిత ఖైదు విధించారు.మరోవైపు పరిహారం తీసుకునేందుకు బాధితురాలి తల్లిదండ్రులు నిరాకరించారు. తమకు పరిహారం వద్దని, న్యాయం మాత్రమే కావాలని పేర్కొన్నారు.సంజయ్ రాయ్‌కు కోర్టు జీవిత ఖైదు విధించడంపై బంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. తామంతా దోషికి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారని, కానీ కోర్టు ఇచ్చిన తీర్పు విషయంలో సంతృప్తి చెందలేదని అన్నారు.

# రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో 9 మంది సభ్యులు గల ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భర పరిస్థితులను అధ్యయనం చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు నివేదిక అందిస్తుందని తెలిపారు.రెండు వారాల పాటు విస్తృతంగా పర్యటించిన అనం తరం, రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న ప్రధాన కారణాలతో పాటు గత ఏడాది వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదికను రూపుదిద్దుతుందని కేటీఆర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్న, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు.

రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఏడాది పాలనలో రైతు ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది ఆందోళనకర పరిస్థితి అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రైతు రుణమాఫీ కనీసం 30 శాతాన్ని కూడా దాటకపోవడం, గతంలో అందిన రైతుబంధును ఆపివేయడం, ఇస్తామన్న 15 వేల రూపాయల రైతు భరోసా సైతం రద్దు చేయడం వంటి ముఖ్యమైన ఆర్థిక సమస్యలు రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని తెలిపారు. అలాగే, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా, సకాలంలో సాగునీటి వసతి కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ కారణంగా రైతులు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్ర వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిందని విమర్శించారు.రైతన్నలను, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దిక్కులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలన్న ఉద్దేశంతో ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. 10 సంవత్సరాల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్ఎస్, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ప్రయత్నిస్తుందని అన్నారు. విస్తృత అధ్యయనం అనంతరం, పార్టీ తరపున రూపొందించే నివేదికను ప్రభుత్వానికి అందజేసి, రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతు సమస్యలపై, వారికి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

**కమిటీ సభ్యులు:**

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ సభ్యులుగా ఉన్నారు.

## దీక్ష విరమించిన 121 మంది రైతులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

డిమాండ్ల సాధన కోసం రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్‌కు సంఘీభావంగా ఆమరణ దీక్ష చేపట్టిన రైతులు తమ దీక్షను విరమించారు. ఖనౌరీ నిరసన ప్రదేశంలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన 121 మంది రైతుల బృందం ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. దల్లేవాల్ వైద్య సహాయం తీసుకున్న తర్వాత అన్నదాతలు తమ దీక్షను ముగించారు. డీఐజీ మన్‌దీప్ సిద్ధు, పాటియాలా సీనియర్ ఎస్పీ నానక్ సింగ్ సమక్షంలో రైతులు రసాన్ని తాగి దీక్షను విరమించారు. అయితే, పంటల కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇచ్చే వరకు దల్లేవాల్ తన నిరాహార దీక్షను విరమించబోరని రైతు నాయకులు తెలిపారు. దల్లేవాల్ ఆరోగ్యం క్షీణించటం, ఆయన దీక్ష చేపట్టి 50 రోజులకు పైగా పూర్తవుతున్నా.. కేంద్రంలోని మోడీ సర్కారు నుంచి ఎలాంటి సానుకూల స్పందనా రాలేదు. వారి డిమాండ్లకు అంగీకరించలేదు. దీంతో 111 మంది రైతుల బృందం ఖనౌరీ సమీపంలో నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఈనెల 17న మరో పది మంది అన్నదాతలు కూడా ఈ నిరసనలో భాగమయ్యారు. నవంబర్ 26న దల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఫిబ్రవరి 14న రైతుల డిమాండ్లను చర్చించటానికి కేంద్రం చర్చలకు ఆహ్వానించిన నేపథ్యంలో దల్లేవాల్ వైద్యానికి అంగీకరించారు. కాగా, నిరాహారదీక్ష చేస్తున్న రైతు నాయకుడు దల్లేవాల్ వైద్య సహాయ నిర్ణయాన్ని ఎస్కేఎం స్వాగతించింది. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యాన్ని పొందాలని ఆక్షాంక్షను వ్యక్తం చేసింది.

## ప్రియుడిని చంపిన ప్రియురాలికి మరణ శిక్ష

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



కేరళలో బాయ్‌ఫ్రెండ్‌ను 2022లో చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో మూడవ నిందితుడు, ఆమెకు సహకరించిన ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్‌కు కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. విద్యాపరమైన తన విజయాలు, గత నేర చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తెను కావడం వంటి కారణాలను పేర్కొని తనకు శిక్ష విధించడంలో కనికరం చూపాలని 24 ఏళ్ల దోషి కోర్టును అభ్యర్థించింది. అయితే, ఆమె క్రూర నేరానికి పాల్పడి, సాక్షాలను చెరిపివేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకోలేమని కోర్టు తన 586 పేజీల తీర్పులో స్పష్టం చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. తనతో రిలేషన్‌షిప్ ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి అతనిని గ్రీష్మ చంపేసింది.ఆ ఘాతుకం జరిగిన సమయానికి ఆమె వయస్సు 22 సంవత్సరాలు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ అంశాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొన్నది. దోషి దశల వారీగా ఈ నేరం సాగించడానికి కుట్ర పన్నిందని, ఆమెకు నేర నేపథ్యం ఉందని, గతంలో ఆ యువకుని హత్యకు ప్రయత్నించిన ఆమె దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు అరెస్టు తరువాత తన ప్రాణం తీసుకునేందుకు ప్రయత్నించిందని కూడా కోర్టు పేర్కొన్నది. కాగా, ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని వాదించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ విఎస్ వినీత్ కుమార్ మీడియాతో చెప్పారు. ఇది ఆదర్శప్రాయమైన ఒక తీర్పుగా ఆయన పేర్కొన్నారు.

2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషం ఇచ్చింది. దానితో అతని శరీరంలోని పలు అవయవాలు విఫలం కావడంతో 11 రోజుల తరువాత అతను చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పని చేసే ఒక వ్యక్తితో తన పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన అనుబంధాన్ని ముగించాలని ఆమె అనుకుంది. కానీ తమ సంబంధం ముగింపునకు అతను నిరాకరించడంతో హత్యకు గ్రీష్మ పథకం వేసింది. హతుడు శరణ్ రాజ్ తిరువనంతపురం జిల్లా పరశ్శల వాసి. హత్యతో సహా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్ సాక్షాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్షాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదల అయింది. కేసు దర్యాప్తును పర్యవేక్షించిన అప్పటి ఎస్పి డి శిల్ప కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పోలీస్ దర్యాప్తు బృందం సమష్టి కృషికి ఇది విజయం అని అన్నారు.


## కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరాను పునరుద్ధరణ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మందుబాబులకు బీర్ల సరఫరా సంస్థ శుభవార్త చెప్పింది. నిలిచిపోయిన కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు సంస్థలు వెల్లడించాయి. తెలంగాణ బీర్ల మార్కెట్లో 60 నుంచి 70 శాతం వాటా కలిగిన యునైటెడ్ బేవరీస్ కంపెనీ (యూబీఎల్) రాష్ట్రంలో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను పెంచినా, తయారీదా రులకు చెల్లించే బేస్ ధరను పెంచక పోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయనీ, వాటికి తోడు తమ కంపెనీకి రావాల్సిన రూ. 900 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈ కంపెనీ ఈ నెల 8న ప్రకటించిన విషయం విదితమే. దాంతో గత రెండు వారాలుగా రాష్ట్రంలో ఆ కంపెనీకి చెందిన కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్ల సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో యూబీఎల్ తాజా ప్రకటన మందుబాబులకు ఊరటనిచ్చింది. ధరల పెంపునకు సంబంధించి కంపెనీ 33.1 శాతం పెంచాలని కోరగా, సర్కార్ 15 నుంచి 20 శాతం వరకు పెంచడంతో పాటు పాత బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ నేపథ్యం లోనే బీర్ల సరఫరాను రాష్ట్రంలో పునరుద్ధరిస్తున్నట్టు ఆ కంపెనీ వెల్లడించినట్టు తెలుస్తోంది.

# కార్మికుల కోసం ఎంతో చేసిన కేసీఆర్

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేసీఆర్ కార్మికుల కోసం ఎంతో చేశాడని. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ మాట వింటే ధైర్యం వస్తుందనుకునే వారు చాలామంది ఉన్నారన్నారు. కేటీఆర్ సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... కష్టం వచ్చినప్పుడే నాయకుడి విలువ తెలుస్తుందన్నారు.2014 జూన్ 2న కేసీఆర్ అధికారంలోకి వస్తే... అదే నెల 21న హమాలీలను పిలిచి వారి సమస్యలపై మాట్లాడారన్నారు. కార్మికుల గురించి పట్టించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ తప్ప ఎవరూ లేరన్నారు. కష్టం వచ్చినప్పుడే నాయకుడి విలువ తెలుస్తుందన్నారు. క్రికెట్ మ్యాచ్ కోసం కూర్చున్నట్లు కేసీఆర్ కరోనా సమయంలో ప్రెస్ మీట్ కోసం కూర్చునే వారని వెల్లడించారు. కరోనా సమయంలో ఇటుక బట్టీలు, హొటళ్లలో పని చేసేవారు... ఇలా ఎంతోమంది కార్మికులు తెలంగాణలో ఉన్నారని, వారు మన రాష్ట్రం వారు కాకపోయినప్పటికీ కేసీఆర్ మానవత్వం చూపారన్నారు. వారు మన రాష్ట్రం కాకపోయినా మన అభివృద్ధిలో వారు భాగస్వాములు అని కేసీఆర్ అన్నారని వెల్లడించారు. సీఎం అయ్యాక మాత్రమే కేసీఆర్‌కు కార్మికులపై ప్రేమ కలిగిందనుకుంటే పొరపాటు అని, 2004లో కేసీఆర్‌కు యూపీఏ హయాంలో తొమ్మిది నెలల పాటు కేసీఆర్‌కు ఏ పోర్ట్‌ఫోలియోను ఇవ్వలేదని, ఆ తర్వాత కూడా ఏరికోరి కార్మిక శాఖను తీసుకున్నారని కేటీఆర్ చెప్పారు. అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం 2005లోనే కేసీఆర్ కమిటీని వేశారన్నారు. ఆ తర్వాత కేసీఆర్ తెలంగాణ సాధన కోసం యూపీఏ నుంచి బయటకు వచ్చారని, దీంతో అసంఘటిత కార్మికులను సంఘటితం చేసే పని అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. ఏడాది కాలంలో లక్షా నలభై వేల కోట్ల అప్పు చేసిన రేవంత్ రెడ్డి అసలు ఏం చేశాడని ప్రశ్నించారు.

## అమెరికాలో కాల్పులు.. హైదరాబాద్ యువకుడు మృతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అమెరికాలో జరిగిన ఒక దుండగుడి కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఆర్‌కే పురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీకి చెందిన కొయ్యడ చంద్రమౌళి కుమారుడు రవితేజ(25) 2022 మార్చిలో ఉన్నత చదువులు కోసం అమెరికా వెళ్లాడు. ఇటీవలే విద్యాభ్యాసం పూర్తి చేసిన అతను వాషింగ్టన్‌లోని ఒక మాల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం మాల్‌లో ఉన్న రవితేజపై ఒక దుండగుడు కాల్పులు జరపగా అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



# ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సైనికుడిగా పనిచేయాలి..

- గంజాయి తరమి కొట్టడంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి
- విద్యార్థినిలు సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి.
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

గంజాయి,మతుపదార్థాలను తరమి కొట్టడంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని,పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించడానికి యోగ,మేడిటేషన్ లాంటివి అలవర్చుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.సోమవారం సిరిసిల్లలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలు ,గంజాయి లాంటి మత్తు పదార్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజాన్ హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు వాలీబాల్స్ అందజేషి,తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో అధికారులతో కలసి "సే నో టు డ్రగ్స్" పోస్టర్స్ ఆవిష్కరించినారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థా లను తరిమికొట్టడంలో భాగస్వామ్యం కావాలని,మాధకద్రవ్యాల నిర్ములానే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని అన్నారు.అందులో భాగంగా జిల్లాలో విద్యార్థులు,ఉపాధ్యాయుల భాగస్వామ్యం తో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పటు చేసి జిల్లాలోని అన్ని పాఠశాలలో, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నన్నారు. ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సైనికుడిగా ఉంటూ జిల్లాలో గంజాయి లాంటి మత్తు పదార్థాలను తరిమి కొట్టాలని,గంజాయి కి సంబంధించిన సమాచారం కోసం తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెంబర్ 8712671111 లేదా జిల్లా టాస్కోర్స్ సిఐ 87126 56392 నంబర్లుకు పోన్ ద్వారా తెలియజేయాలని అన్నారు .

విద్యార్థిని,విద్యార్థులు జీవితంలో ఉన్నత విజయాలను చేరుకోవడానికి హార్డ్ వర్క్ యే ప్రధాన అస్త్రం అని,కష్టపడే తత్వమే విజయాల దరికి చేరుస్తుందన్నారు.ఎలాంటి పరిస్థితుల్లోనైనా తము ఎంచుకున్న లక్ష్యం కోసం చేసే ప్రయత్నాలను మధ్యలో నిలిపివే యకుండ ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణతో, ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు.ప్రతి విద్యార్థి ఒక సారి చేసిన తప్పును మళ్లీ చేయకుండ ఆ తప్పులు నుండి నేర్చుకొని విజయాలు సాధించాలని,విద్యార్థులు ఎప్పుడు తమకు తామే పోటీ అనుకోవాలే తప్ప ఇతరులతో తమను తాము దేనిలోనూ పోల్చుకోవద్దని సూచించారు.పరీక్షలలో మార్కులు తక్కువ, మధ్యస్థంగా వచ్చిన ఎవరు బాధపడనవసరం లేదని, గొప్ప గొప్ప స్థాయికి వచ్చినా వారంతా అవ్యరేజ్ స్టూడెంట్స్ అని,ప్రతి విద్యార్థి ఒత్తిడిని అధిగమించడానికి యోగ, మెడిటేషన్, బుక్స్ చదవడం లాంటివి అలవర్చుకోవలన్నారు. విద్యార్థిని విద్యార్థుల సోషల్ మీడియా (ఫేసుబుక్, ఇంస్టాగ్రామ్)కు దూరంగా ఉండాలని,ప్రస్తుతం మహిళలపై వేధింపులు అఘాయిత్యాలు,సోషల్ మీడియా వేధింపులు ఆన్లైన్ వేధింపులు సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ ఫ్రాడ్స్ ఎక్కువగా జరుగుతున్నాయని ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయ ంగా షీ టీమ్ నంబర్ 87126 56425 సమాచారం ఇవ్వగలరని, సమాచారం అందించిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి , నార్కోటక్ బ్యూరో డిఎస్పీ ఉపేందర్, సి.ఐ కృష్ణ, సిబ్బంది, పాఠ శాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్‌తో పోటీపడి స్వయం సమృద్ధి సాధించాలి..

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు
- ఇందిరా మహిళా శక్తి చీరల పథకం చీరల ఆర్డర్స్ అందజేత
- టెస్కో జీఎం అశోక్ రావు



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్ తో పోటీపడి స్వయం సమృద్ధి సాధించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ ఆర్డర్స్ తయారు చేసేలా యంత్రాలు ఆధునీకరించాలని టెస్కో జీఎం అశోక్ రావు అన్నారు .సోమవారం జిల్లా కలెక్టరేట్లో రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అందించే యూనిఫామ్ చీరల ఆర్డర్లు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు టెస్కో జీఎం అశోక్ రావు అందజేశారు. ఈ సందర్భంగా టెస్కో జీఎం అశోక్ రావు మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి చీరల పథకంలో భాగంగా ముందుగా ఒక చీరను ( అందరికీ ఒకే రంగు చీర) ఆర్డర్స్ దాదాపు 4.24 కోట్ల మీటర్లు అందజే సిందని, చీరలను ఈ ఏప్రిల్ 30 వ తేదీలోగా సిద్ధం చేయాలని,ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసిందనిఅన్నారు . వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేసిందని,ఆధునిక, నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేలా సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇప్పటికే స్కూల్ యూనిఫాం మరమగ్గాల సంఘాలకు 65.67 లక్షల మీటర్లు ఆర్డర్స్ ఇచ్చామని అన్నారు .ఈ కార్యక్రమంలో హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్, టెస్కో ఏడీ సందీప్ జోషి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..

- ఎస్ఐ పృథ్విధర్ గౌడ్




**బలగం టీవీ , బోయినిపల్లి**

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై పృథ్వీధర్ గౌడ్ అన్నారు.సోమవారం బోయినిపల్లి మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆనందు విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పృథ్విధర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు బైక్ నడిపేటప్పుడు హెల్మెట్, కారు నడిపే వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. ఏఎస్ఐ మోతీరామ్, హెడ్ కానిస్టేబుల్ గంగరాం, ఉమెన్ పోలీస్ పింకీల్ యాదవ్, పోలీస్ సిబ్బంది మరియు ఆనంద్ స్కూల్ విద్యార్థులు స్కూలు యాజమాన్యం పాల్గొన్నారు.



# చిరుత పులి దాడిలో లేగ దూడ మృతి...

**బలగం టీవీ, గంభీరావుపేట**

చిరుతపులి సంచారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామ శివారులో కలకలం రేపుతున్నది. సోమవారం తెల్లవారుజామున లేగ దూడ పై ఓ చిరుత పులి దాడి చేయడంతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాస మల్ల రాజు రైతు గ్రామ సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో లేగ దూడను కట్టేసి ఉంచారు. సోమవారం ఉదయం రైతు తన పొలం వద్దకు వెళ్లగా లేగా దూడ పై చిరుత పులి దాడి చేసి చంపి తిన్నది. ఈ విషయాన్ని గ్రామ గ్రామ ప్రజలు రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్ట్ అధికారి అంజలి బీట్ ఆఫీసర్ రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ జంతువు తిరిగిన చోటును పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చిరుత నడిచిన పాదాలు చూసి ఇది చిరుతనే దాడి చేసిందని తెలిపారు.



# రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు, కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ...

**బలగం టీవీ ,సిరిసిల్ల**

రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు,కరాటే పోటీల పోస్టర్ ను హైదరాబాద్ లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నందు బలగం సినిమా డైరెక్టర్ వేణు ఎల్డండి,స్పార్క్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ వోడ్నాల శ్రీనివాస్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా స్పార్క్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు, కరాటే పోటీలను రాజన్న సిరిసిల్లలో ఫిబ్రవరి 16 ఆదివారం రోజు నిర్వహిస్తున్నమని అన్నారు .రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ని వెంకంపేట లోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్ నందు ఉదయం 9 గంటలకు ప్రారంభమౌతాయని,ఈ పోటీలకు ముఖ్య అతిథిగా బలగం సినిమా డైరెక్టర్ ఎల్డండి వేణు హాజరు అవుతారని అన్నారు.నిర్వహాకులుగా వోడ్నాల శ్రీనివాస్ వ్యవహరిస్తారని,రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు, కరాటే పోటీలకు వివిధ జిల్లాల నుండి 1000 మంది విద్యార్థిని విద్యార్థులు 50 మంది మాస్టర్లు పాల్గొంటారని ఇట్టి పోటీలను విజయవంతం చేయాలని కోరారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాస్టర్ అన్నపూర్ణ, మాస్టర్ ప్రవళిక, మాస్టర్ ని వేదిత మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్, మాస్టర్ చంద్రశేఖర్, మాస్టర్ వేణు లు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి...

**బలగం టీవీ, గంభీరావుపేట**

కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొత్త పల్లి గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామములో ప్రభుత్వ భూమి 2014 సంవత్సరం నుండి గ్రామములో 200 ఎకరాల భూమిని బిఆర్ఎస్ నాయకులు మరియు వారి కార్యకర్తలు ఇష్టానుసరంగా అక్రమించుకోవడం జరిగిందని తెలిపారు.అలాగే గ్రామంలో 4 చెరువులు కలవు వాటిని గ్రామంలో ఉన్న కుంటలను ఆక్రమిమచుకోవడం జరిగిందని అన్నారు. గ్రామములో ఆక్రమించుకున్న ప్రభుత్వం భూమి సర్వే నెంబర్లు 474, 475, 649, 101 మరియు 83 అలాగే కొత్తపల్లి గ్రామంలోని ఊర చెరువు, పటేల్ చెదుప్పు, రంగడి చెరువు, అక్కపల్లి చెరువు మరియు కమ్మరికుంట, త%శీ%బాలలోని కుంట, కర్నాల కుంటు, కురాకుల కుంట, ఆక్రమసలు గుర కావడం జరిగిందని అన్నారు. అక్రమనకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇవ్వాలని అన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి..

- ప్రజావాణికి 202 దరఖాస్తుల రాక.
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ,సిరిసిల్ల**

ప్రజల నుండి స్వీకరించే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.ఇక్కడ ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి..

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవి, సిరిసిల్ల**

జనవరి 26 న భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్లో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ పై జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతు భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించుటకు, గ్రౌండ్ ను, డయాస్ ను పోలిస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పూల అలంకరణతో సిద్ధం చేయాలని అన్నారు. వేడుకల సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు ప్రోటోకాల్ ప్రకారం చేయాలని సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ అధికారిని, సిరిసిల్ల తహశీల్దార్ ను ఆదేశించారు.వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ



పథకాలతో కూడిన స్టాళ్ల ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించుటకు వీలుగా, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు.

వేడుకల సందర్భంగా గ్రౌండ్ కు వచ్చు ప్రజలకు, విద్యార్థిణి,విద్యార్థులకు త్రాగు నీటికి వాటర్ బాటల్స్ సమకూర్చాలని, మున్సిపల్ అధికారులను, ఈ వేడుకల్లో జాతీయ భావం పెంపోందెలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిఈవో ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రసంశ పత్రాలను ప్రధానం చేయుటకు ఇంతవరకు ప్రశంస పత్రములు పొందని ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఎంపిక చేసి జనవరి 24 లోగా ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డిఓ వెంకటరెడ్డి, డిపిఆర్ఓ.వి. శ్రీధర్, కమిషనర్ లావణ్య, డీఈవో జగన్మోహన్ రెడ్డి సిరిసిల్ల తహసిల్దార్ ఉమారాణి, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, ఏ.డి. హ్యాండ్లూమ్స్ %ఌ% టెక్స్టైల్ సాగర్, ఏఆర్.ఆర్.ఐ.లు మధుకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల మహాప్రదర్శనను విజయవంతం చేద్దాం...

- ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అండగా ఉండడం బీసీల బాధ్యత

**బలగం టీవీ , సిరిసిల్ల**



మహా ఆది జాంబవంతు వారసులైనలైన మాదిగలు ఎంతో వెనుక బాటుతనానికి గురవుతున్నారని అందుకే ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ చేసి దళితవాడ బతుకుల్లో వెలుగులు నింపాలని బీసీ కవులు కళాకారులు మేధావుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న అన్నారు.సోమవారం సిరిసిల్ల లోని కే కన్వెన్షన్ హాల్లో ఎమ్మార్పీఎస్ కు బీసీ కవులు కళాకారులు మేధావుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న, ప్రముఖ రచయిత మోహన్ బైరాగి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పోరాటంలో అమరులైన సురేందర్ మాదిగ భారతి మాదిగకు జోహార్ జోహార్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు విలేకర్ల సమావేశం లో దరువు అంజన్న మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా జరుగుతున్న మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఒక నిరంతర పోరాటమని ఈ పోరాటంలో ఎందరో వీర మరణం చెందారని వారి మరణం వృధా కాదని త్వరలో జరగబోయే ఎస్సీ వర్గీకరణ దానికి తార్కానమని అన్నారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేయడం సమంజసం అని చెప్పిన, కమీషన్లు సైతం ఎస్సీ వర్గీకరణ జరగాలని పేర్కొన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించడం లేదని అందుకే తప్పక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి ఎస్సీ వర్గీకరణను అధికారికంగా ప్రకటించాలని అన్నారు.

ప్రముఖ రచయిత మోహన్ బైరాగి మాట్లాడుతూ ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ నూటికి నూరుపాళ్ళు ప్రజాస్వామిక హక్కుని కనుక దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ అలుపెరుగని సూర్యుని వలె పోరాటం కొనసాగిస్తున్నారని, పోరాటం చివరి దశకు వచ్చిందని దానిని ప్రభుత్వాలు అధికారికంగా అమలు చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ పి రాష్ట్ర నాయకులు గుండా థామస్ మాదిగ,ఎంఎస్ పి జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్, అంబేద్కర్ సంగం డివిజన్ అధ్యక్షులు కత్తెరపాక దేవదాస్,మార్కెట్ చైర్మన్ గోట్టపల్లి సుధాకర్,కౌన్సిలర్ సత్యనారాయణ, అవును నూరి వెంకటరాములు, నాయకులు పశువుల బాలయ్య, పరశురాములు పోకల సాయి, రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు



## విద్యార్థులకు పోలీస్ అక్క ప్రోగ్రాం

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్ల బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాల లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండలం ఎస్సై పృథ్వీధర్ ఆధ్వర్యంలో మహిళా సిబ్బంది పింకిల్ యాదవ్ పోలీస్ అక్క ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఇట్టి ప్రోగ్రాంలో విద్యార్థిని, విద్యార్థులకు సేఫ్ టచ్ అండ్ అన్ సేఫ్ టచ్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 100 డైల్ ప్రాధాన్యతను వివరించడం జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కి మరియు ఎవరైనా ఆకతాయిలు ఏడిపిస్తే షీ టీం నెంబర్ 8712656425కి గాని ఫోన్ చేయమని తెలపడం జరిగింది.

## 'గుట్ట పుట్టలను వదలని భూ అక్రమార్కులు'



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

మండలంలోని సారంపల్లి రెవెన్యూ పరిధిలోని దేశయిపల్లి గ్రామ శివారులో గల భూమి సర్వేనెంబర్ 338లో 150 ఎకరాల భూమి అన్యక్రాంతంగా మారిందని గ్రామంలోని రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ రైతులతో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించి ఈ సర్వేనెంబర్ 338 లో మొత్తం550 ఎకరాల భూమి ఉంటే ఇందులో 220కరాలు అటవీ శాఖ ఆధీనంలో ఉండగా 60 ఎకరాలు రైతులు సాగు చేసుకుంటున్నారని మిగిలిన భూమి రైతుబంధు కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం లో ధరణిలో నమోదు చేసుకొని లక్షల రూపాయలు రైతుబంధు, రైతు బీమా,పీఎం కిసాన్ వంటి పథకాలతో లబ్ధి పొందారని ఇక్కడ మొఖ మీద తాత ముత్తాతల నుండి సాగు చేసుకుంటూన్న రైతులకు పట్టాలు పంపిణీ చేయకుండా ఎక్కడో ఉన్న వారికీ భూమి ఎక్కడ ఉందో కూడా తెలియని దుస్థితిలో ఉన్నవారికి ధరణిలో పేరు ఎక్కడం శోచనీయంగా మారిందన్నారు. దీని వెనుక టిఆర్ఎస్ ప్రభుత్వం, అధికారులు తొత్తులుగా మారి కాసుల కోసం కక్కుతి పడినట్లుగా ఉందని ఆరోపించారు. వెంటనే అధికారులతో సర్వే చేయించి సాగు చేసుకుంటున్నా రైతులకు పట్టాలు ఇప్పించే విధంగా పొన్నం ప్రభాకర్ గౌడ్, కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మరియు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పట్టాల పంపిణీ ఏర్పాటుగా చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు మల్యాల మైసయ్య,చిట్యాల రమేష్, దేవయ్య,ప్రశాంత్,పోలిగంటి మెసయ్య, మల్లయ్య, సిరిసిల్ల చిన్న దేవయ్య,పెద్ద దేవయ్య, చిట్యాల బాల్ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్న పట్నాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్లపల్లి మండలంలోని చీర్లవంచ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్ స్వగృహంలో జరిగిన మల్లన్న పట్నాల కార్యక్రమంలో కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవిందర్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు అగ్గి రాములు, బొల్లి రామ్మోహన్, రాఘవరెడ్డి విజేందర్ రెడ్డి,మధు,రవి, సందీప్,రేణుక,సంపత్,శ్రీనాథ్ దేవన్న తదితరులు హాజరయ్యారు.




# కన్నప్పలో శివుడిగా అక్షయ్ కుమార్

## పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

విష్ణు మంచు ప్రధాన పాత్రలో, ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో వస్తున్న చిత్రం కన్నప్ప. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద మోహన్ బాబు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నుంచి అక్షయ్ కుమార్, మాలీవుడ్ నుంచి మోహన్ లాల్, టాలీవుడ్ నుంచి ప్రభాస్, కోలీవుడ్ నుంచి శరత్ కుమార్, ప్రభుదేవా వంటి వారిని ఈ ప్రాజెక్ట్ కోసం తీసుకు వచ్చారు. ఇప్పటికే ఈ సినిమాలో పలువురి పాత్రల పోస్టర్స్ రిలీజ్ చేశారు. 'కన్నప్ప' టీజర్ కూడా రిలీజ్ చేశారు. ఇక ఈ సినిమాలో శివుడి పాత్రలో నటిస్తున్న అక్షయ్ కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ పోస్టర్ లో శివుడి పాత్రలో అక్షయ్ కుమార్ త్రిశూలం, ఢమరుకం పట్టి నాట్యం చేస్తున్నట్టు ఉంది. పోస్టర్ పై 'ముల్లోకాలు ఏలే పరమశివుడు భక్తికి మాత్రం దాసుడు' అని రాశారు.

కాగా, 'కన్నప్ప' సినిమాలో శివుడిగా అక్షయ్ కుమార్ నటిస్తుంటే.. పార్వతి దేవి పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఆమె పార్వతి దేవి లుక్ ను కూడా విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రతీ సోమవారం ఈ చిత్రం నుంచి ఓ పోస్టర్ వస్తూనే ఉంది. ఇక ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను ఇప్పటికే చిత్రం యూనిట్ ప్రారంభించింది. ఈక్రమంలోనే బెంగళూరు, చెన్నై అంటూ చిత్రబృందం తిరుగుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ వేసవిలో ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఇలాంటి ఓ అద్భుతమైన సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని, శివుని ఆశీస్సులతో ఆడియెన్స్ ముందుకు ఏప్రిల్ 25న రాబోతోన్నామంటూ అక్షయ్ కుమార్ తన సోషల్ మీడియాలో రిలీజ్ చేసిన ఈ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది.




# లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా రిషబ్ పంత్..

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా భారత జట్టు స్టార్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్‌నియామకమయ్యాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గొయెంకా వెల్లడించారు. రాబోయే ఐపీఎల్‌లో పంత్ అంత్య విజయవంతమైన కెప్టెన్‌గా నిలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు గొయెంకా. ఇటీవల జెడ్డా వేదికగా జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో లక్నో జట్టు రూ.27కోట్లు పెట్టి కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఐపీఎల్-2025 సీజన్ ఈ ఏడాది మార్చి చివరి వారంలో మొదలుకానున్నది గత సీజన్ వరకు లక్నో జట్టు కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ కొనసాగాడు. లక్నో కేఎల్ రాహుల్‌ను రిటైన్ చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఇక రిషబ్ పంత్ గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో కొనసాగిన విషయం తెలిసిందే. రిషబ్ పంత్ ఢిల్లీకి 2016 నుంచి ప్రాతినిథ్యం వహిస్తూ వచ్చాడు. 110 మ్యాచ్‌ల్లో 35.31 సగటుతో 3,284 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 18 అర్ధ సెంచరీలు ఉన్నాయి. పంత్ 2021లో ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అదే సీజన్‌లో జట్టును ప్లేఆఫ్ వరకు చేర్చాడు.

# నటుడు విజయ్ రంగరాజు కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలుగు సీనియర్ నటుడు విజయ రంగరాజు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపదడుతున్న రంగరాజు, చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఇటీవల షూటింగ్‌లో గాయపడ్డ రంగరాజు చికిత్స కోసం చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అయితే సడెన్‌గా గుండెపోటుకు గురై రంగరాజు మృతి చెందారు. ఆయన మృతి పట్ల టాలీవుడ్ ఇండస్ట్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కాగా, 1994లో భైరవద్వీపం సినిమాతో ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. 30 ఏళ్ల కెరీర్‌లో విలన్, సహాయ పాత్రలు పోషించారు. ముఖ్యంగా గోపిచంద్ 'యజ్ఞం' సినిమాతో రంగరాజుకు మంచి గుర్తింపు లభించింది.

# 'భైరవం' టీజర్ విడుదల

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్‌పై డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కెకె రాధామోహన్ నిర్మించారు. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సోమవారం ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ "భైరవం' లాంటి మంచి కథ దొరికినందుకు చాలా హ్యాపీగా ఉంది. డైరెక్టర్ విజయ్ చాలా హార్డ్ వర్క్ చేశారు. నారా రోహిత్, మంచు మనోజ్‌తో వర్క్ చేసే అవకాశం రావడం ఒక బ్లెసింగ్‌గా భావిస్తున్నాను. ఈ సినిమా అందరికీ మంచి పేరు తీసుకొచ్చి, మమ్మల్ని మరో మెట్టు పైకి తీసుకెళ్తుందని కోరుకుంటున్నాను' అని తెలిపారు.'ఇది జస్ట్ టీజర్ మాత్రమే. ట్రైలర్ అదిరిపోతుంది. సినిమా దుమ్ము లేచిపోతుంది. మీ అందరి బ్లెస్సింగ్స్ ఉంటాయని ఆశిస్తున్నాను' హీరో మనోజ్ మంచు అన్నారు. హీరో నారా రోహిత్ మాట్లాడుతూ, 'నా కెరీర్‌లో ఎప్పుడూ చేయని ఒక క్యారెక్టర్ ఇందులో చేశా. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే సినిమా ఇది' అని చెప్పారు. దర్శకుడు విజయ్ కనకమేడల మాట్లాడుతూ,'శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. 'వెన్నెల..' పాట బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఈ సినిమా మాస్ యాక్షన్ ఆడియన్స్‌కి పండగలా ఉంటుంది. ముగ్గురు హీరోలతో కలిసి పని చేయడం నాకు చాలా అద్భుతమైన అనుభూతినిచ్చింది. నా 'నాంది' సినిమాని చూసినప్పుడు ప్రేక్షకులు ఎంతగా ఫీల్ అయ్యారో, అలాగే ఈ సినిమా చూసినప్పుడు కూడా అలాగే ఫీల్ అవుతారు. 'నాంది' కంటే మంచి పేరు ఈ సినిమా తీసుకొస్తుందనే నమ్మకంతో ఉన్నాను' అని తెలిపారు. 'దర్శకుడు విజయ్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని చాలా అద్భుతంగా తీశారు' అని నిర్మాత కేకే రాధా మోహన్ చెప్పారు.




# ఫిబ్రవరి 15న సిద్ శ్రీరామ్ మ్యూజికల్ కాన్సర్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ సింగర్ సిద్ శ్రీరామ్ ఫిబ్రవరి 15న హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ నిర్వహించబోతోన్నాడు. కాన్సర్ట్‌ను మూవ్-78 లైవ్ సంస్థ ప్లాన్ చేసింది. ఈ కాన్సర్ట్ విశేషాల్ని తెలియజేసేందుకు మూవ్-78 లైవ్ సంస్థ సీఈవో నితిన్ కనకరాజ్, సింగర్ సిద్ శ్రీరామ్ మీడియా ముందుకు వచ్చారు. ఈ మేరకు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సిద్ శ్రీరామ్ మాట్లాడారు. "గత పదేళ్ల నుంచి తెలుగు ఆడియన్స్ ఎంతో ప్రేమను కురిపిస్తూనే ఉన్నారు. నాకు తెలుగులోనే ఎక్కువ మంది అభిమానులున్నారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ చేశాను. మళ్లీ ఇప్పుడు చేయబోతోన్నాం. ఈ కాన్సర్ట్‌లో నా పాటలతో పాటుగా 80, 90వ దశకంలో వచ్చిన మెలోడీ పాటల్ని కూడా పాడతాను. నేను ప్రస్తుతం తెలుగు నేర్చుకుంటున్నాను. నాకు ఓ ఏడాది టైం ఇవ్వండి తెలుగులో ఫ్లూయెంట్‌గా మాట్లాడేందుకు ప్రయత్నిస్తాను" అని అన్నారు. నితిన్ కనకరాజ్ మాట్లాడుతూ... "సిద్ శ్రీరామ్‌తో మూడేళ్ల తరువాత మళ్లీ హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నాం. ఫిబ్రవరి 15న ఈ ఈవెంట్‌ను నిర్వహించబోతోన్నాం. ఈ కాన్సర్ట్ ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ కోసం, యూత్ కోసం ఏర్పాటు చేస్తున్నాం. నాకు పర్సనల్‌గా సిద్ శ్రీరామ్ అంటే చాలా ఇష్టం. ఈ జనరేషన్ వాళ్లు సిద్ ను చాలా అభిమానిస్తారు. ఈ ఈవెంట్, లైవ్ కాన్సర్ట్ అద్భుతంగా ఉండబోతోంది. గ్రూపుగా టికెట్లు బుక్ చేసుకుంటే డిస్కౌంట్ కూడా ఉంటుంది" అని అన్నారు.



# న్యూజిలాండ్‌పై నైజీరియా సంచలన విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

న్యూజిలాండ్ జట్టును పసికూన నైజీరియా ఓడించింది. 2025 మహిళల అండర్-19 వరల్డ్‌కప్‌లో భాగంగా తాజాగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నైజీరియా అమ్మాయిల జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో నెగ్గి చరిత్ర సృష్టించింది. మలేసియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం న్యూజిలాండ్- నైజీరియా జట్లు తలపడ్డాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. దీంతో 20 ఓవర్లు సాగాల్సిన ఆటను నిర్వాహకులు ఇరువైపులా 13 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన నైజీరియా మహిళల జట్టు 13 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతరం స్వల్ప లక్ష్య చేధనకు దిగిన న్యూజిలాండ్ 13ఓవర్లు ఆడి 63-6 స్కోర్‌కే పరిమితమైంది. అయితే చివరి 6 బంతుల్లో కివీస్ విజయానికి 9 పరుగులు అవసరమయ్యాయి. ఆ సమయంలో లిలియన్ ఉదేహ్ ఆఖరి ఓవర్ అద్భుతంగా బౌలింగ్ చేసి తన జట్టుకు చరిత్రాత్మక విజయం అందించింది. కాగా, అండర్- 19 టీ20 వరల్డ్‌కప్ హిస్టరీలో నైజీరియా జట్టుకు ఇదే తొలి విజయం కావడం విశేషం.

# రహస్యంగా పెళ్లి చేసుకున్న నీరజ్ చోప్రా

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత జావెలిన్ ఛాంపియన్ నీరజ్ చోప్రా సీక్రెట్ గా పెళ్లి చేసుకున్నాడు. తన వివాహాన్ని రసహ్యంగా ఉంచిన చోప్రా తాజాగా బయటపెట్టారు. ఆదివారం రాత్రి తన పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నాడు. "నా కుటుంబంతో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాను. మమ్మల్ని ఈ క్షణానికి చేర్చిన ప్రతి ఆశీర్వాదానికి కృతజ్ఞతలు. నీరజ్ లవ్ హిమానీ" అని చోప్రా తన పోస్ట్‌కు క్యాప్షన్‌లో పెట్టాడు. దీంతో అభిమానులు, పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు చోప్రా దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రస్తుతం చోప్రా పెళ్లి ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నారు. నీరజ్ పెళ్లి చేసుకున్న అమ్మాయి ఎవరా? అని సెర్చ్ చేస్తున్నారు. కాగా, హిమానీ మోర్ అనే యువతిని నీరజ్ చోప్రా పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల మధ్య ఓ ప్రైవేట్ వేడుకలో నీరజ్ పెళ్లి చేసుకున్నారు. హిమానీ టెన్నిస్ క్రీడాకారిణినిగా తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె అమెరికాలోని సౌత్ ఈస్టర్న్ లూసియానా విశ్వవిద్యాలయంలో చదువుతున్నట్లు సమాచారం.